క్లుప్తంగా

అసంపూర్తి పనికి పోలీసుల రక్షణ


కల్వర్టుకు అడ్డుగా డివైడర్ బోర్డులు ఏర్పాటు చేసిన పోలీసులు

సామర్లకోట: కాంట్రాక్టర్లు చేయవలసిన పనిలో పోలీసులు చొరవ తీసుకుని ప్రమాదాలకు అడ్డుకట్ట వేశారు. మెహర్ కాంప్లెక్స్ నుంచి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో ఉన్న కల్వర్టు నిర్మాణ పనులకు కాంట్రాక్టరు మూడు రోజుల క్రితం కల్వర్టును తవ్వి అసంపూర్తిగా వదిలి వేశాడు. వాహన చోదకులు కల్వర్టును గమనించక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఏఎస్సై రత్నం కల్వర్టు వద్ద డివైడర్ బోర్డులు ఏర్పాటు చేశారు.

విత్తన దుకాణాలపై విజిలెన్స్ దాడులు


గొల్లప్రోలులోని విత్తన దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని విత్తన దుకాణాలపై గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ నాయుడు, సీఐ శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, మండల వ్యవసాయశాఖ అధికారి సత్యనారాయణ తదితరులు గొల్లప్రోలులోని స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీలు చేశారు. గొడౌన్‌లో ఉన్న లాట్‌కు ఇన్వాయిస్ లేకపోవడంతో రూ.82,741 విలువైన 87 ప్యాకెట్ల అమ్మకాలను నిలిపివేశారు. మిగిలిన విత్తనాలకు రికార్డులు సక్రమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు


విద్యార్థులకు రన్నింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వైఎస్సార్ కడప జిల్లాలోని క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు షార్ట్ పుట్, లాంగ్‌జంప్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ అబ్రహం లింకన్ తెలిపారు.

కేసులు ఎత్తివేయాలంటూ నిరసన


కొండెవరంలో నిరసన తెలుపుతున్న రైతు కూలీ సంఘం నేతలు

కొత్తపల్లి: ప్రజాగాయని, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ చైర్‌పర్సన్ విమలక్క, మోహన్ బైరాగిలతో పాటు ఉద్యమకారులపై పెట్టిన ఉపా చట్టం కేసులను ఎత్తివేయాలని అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు కుంచే అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని కొండెవరంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కూలీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు డి.సురేష్, వి.సత్తిబాబు, చెల్లంగి, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు


ఎల్ఎన్ పురంలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

పిఠాపురం: భారత ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి గండి కొండలరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు పిఠాపురం మండలం ఎల్ఎన్‌పురంలో ఇంటింటికీ వెళ్లి బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రపంచ దేశాలను ఆకర్షించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ విజయం సాధించారని తెలిపారు. ఎల్ఎన్‌పురం ఎంపీటీసీ బీశెట్టి గంగా మహేష్, బీజేపీ మండలాధ్యక్షుడు పిల్లా ముత్యాలరావు పాల్గొన్నారు.

కొసరు పనులకు ఎసరు

- గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటుతో రహదారి ఛిద్రం
- పరిహారం చెల్లించినా నిర్మాణంలో జాప్యం


గోతులతో అధ్వానంగా ఉన్న సత్యనారాయణపురం రోడ్డు

సామర్లకోట: అభివృద్ధి పనులు చేసే సందర్భాల్లో కొసరు పనులు విస్మరించడం వల్ల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటుంటారు. స్థానిక సత్యనారాయణపురం వెళ్లే రహదారిలో ఏడేళ్ల క్రితం భూగర్భ గ్యాస్ పైప్‌లైన్లు ఏర్పాటుచేశారు. సదరు గ్యాస్ సంస్థ ఈ పనుల నిమిత్తం మున్సిపాలిటీకి నష్ట పరిహారం సైతం చెల్లించింది. అయినప్పటికీ సిబ్బంది గోతులు పూడ్చకపోవడంతో చిన్న వాహనచోదకులు, పాదచారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎఫ్‌సీఐతో పాటు పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని పరిశ్రమలకు వెళ్లడానికి రాక పోకలు సాగిస్తారు. వర్షాలకు ఈ రోడ్డు మరింతగా తూట్లు పడి పోయింది. బస్సు కాంప్లెక్స్, రైల్వే స్టేషన్లకు రాక పోకలు సాగించడానికి ఇదే ప్రదాన మార్గం. ఫ్లైఓవర్ ప్రారంభం నుంచి రోడ్డు గోతు లుగా ఉండటం మరో వైపు 'బార్' ఉండటంతో నడిచి వెళ్లే మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

నిధులు కేటాయించాలి



బార్ నుంచి సత్యనారాయణపురం వెళ్లు రోడ్డు నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘ నిధులు కేటాయించాలని కమిషనర్ రామారావుకు సూచించడం జరిగింది.

– దవులూరి దొరబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, సామర్లకోట

తొలి ప్రాధాన్యం ఇదే..



సత్యనారాయణపురం రోడ్డు నిర్మాణానికి 14వ ఆర్థిక సంఘ నిధులు కేటాయించగా నిధుల కొరత వల్ల నిర్మించలేదని ఏఈ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రాగానే ఈ రహదారి నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తాం.

– జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలి


సమావేశానికి హాజరైన అధికారులు, బ్యాంకుల సిబ్బంది

పెద్దాపురం: టిడ్కో గృహాలకు ఇవ్వాల్సిన రుణాల మంజూరు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్‌డీఎం) ప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎల్‌డీఎం ఆధ్వర్యంలో బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో టిడ్కో గృహాలకు సంబంధించి రుణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సత్వరమే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి రుణాల మంజూరు చేయాలని ఆదేశించారు. డ్వాక్రా రుణాలు, జగనన్న తోడు, పీఎం స్వానిధి, ముద్ర రుణాల రికవరీపై దృష్టి సారించాలని ఎల్‌డీఎం ప్రసాద్ సూచించారు. అనంతరం పలు అంశాలపై ఆయన సమీక్షించారు. సమావేశంలో వైఎస్సార్ క్రాంతి పథం డీపీఎం పద్మావతి, పెద్దాపురం, సామర్లకోట ఏపీఎంలు సూర్యనారాయణ, ప్రశాంతి, తవుడు, మెప్మా సిబ్బంది వెంకటలక్ష్మి, జ్యోతి, సుజాత, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

రేపు షష్టి ఉత్సవం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర ఆలయంలో శనివారం కుమార షష్టి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ డి నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉప ఆలయంలోని కుమారస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. అలాగే 26వ తేది సోమవారం అషాఢ మాసాన్ని పురస్కరించు కొని మహిషాసురమర్దిని అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. 29వ తేదీన తొలి ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలోని విష్ణుమూర్తి ఆలయంలో స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

భవిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి


భవిత సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీవైఈఓ సుభద్ర

పెద్దాపురం: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం భవిత సెంటర్ల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీవైఈఓ డి.సుభద్ర సూచించారు. స్థానిక మహాత్మాగాంధీ మున్సిపల్ పాఠశాలలోని భవిత సెంటర్‌లో విభిన్న ప్రతిభా వంతులకు అందిస్తున్న ప్రత్యేక ఫిజియోథెరపీ సేవలను గురువారం ఆమె పరిశీలించారు. భవిత కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ విభిన్న ప్రతిభా వంతులకు విద్యాశాఖ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. సెంటర్ ద్వారా అర్బన్, రూరల్ పరిధిలోని విభిన్న ప్రతిభా వంతులకు మెరుగైన వైద్య, విద్య సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విభిన్న ప్రతిభావంతుడైన విద్యార్థికి అందిస్తున్న ఫిజియోథెరపీ ప్రక్రియను పరిశీలించారు. భవిత ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు, భవిత సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవల్లో 'లయన్స్' ముందంజ


యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేసిన జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్, సభ్యులు

సామర్లకోట: సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని క్లబ్ గవర్నర్ మార్ని మంగతాయారు అన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ సేవలను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం పంచారామ క్షేత్రంలో ఆమె పూజలు చేశారు. అనంతరం క్లబ్ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని క్లబ్ సేవలను అభినందించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలో ఇడుక దీప్తికి కుట్టు మిషన్, అమ్మాజీ, వి.రామాదేవిలకు గ్రైండర్లు, పెద్దాపురంలోని అగ్నిప్రమాద బాధితులకు రూ.రెండు వేలు, అంతర్జాతీయ యోగా పోటీలకు వెళుతున్న కిల్లాడి యశ్వంత్‌కు ఆర్థిక సాయం అందజేశారు. సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు చిత్తూలూరి వీర్రాజు, శ్రీదేవిల దంపతులు 15 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. జిల్లా గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని వీటిని అందజేశారు. లయన్స్ క్లబ్ మొదటి గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, క్లబ్ అధ్యక్షురాలు సిరిపురపు సుధారాణి, కార్యదర్శి ఎస్.సురేష్, కోశాధికారి గిడుతూరి శ్రీను, జీవీఎస్ఎస్ ప్రకాష్, క్లబ్ మాజీ అధ్యక్షుడు మాజేటి కృష్ణ, కర్రి ఆదినారాయణ రెడ్డి, సింగవరపు సత్యనారాయణ, విజయభాస్కరరెడ్డి, మేకా శ్రీనివాసు, గుండు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వివాదంలో ఇద్దరికి గాయాలు

పిఠాపురం: వీధిలో కాలువ నిర్మాణం విషయంలో తలెత్తిన వివాదంలో ఇద్దరికి గాయాలైనట్టు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన లింగం చక్రధర్ తమ వీధిలో కాలువ నిర్మాణం త్వరగా చేపట్టాలని అధికారులకు వినతిపత్రం ఇచ్చాడు. కాలువ నిర్మాణం ఇష్టం లేని అదే గ్రామానికి చెందిన లోకారెడ్డి సూరిబాబు, అతని కుమారులు లోకారెడ్డి వీరబాబు, దొరబాబు చక్రధర్‌తో పాటు అతని తండ్రిపై దారి కాచి కర్రలతో దాడి చేశారు. గాయాలైన ఇద్దరిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీనిపై చక్రధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: మండల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ డి.శ్రీలలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడపాడులో రెండు, వేట్లపాలెం ఒకటి, మాధవపట్నం ఒకటి, జి.కొత్తూరులో ఒక వలంటీరు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి కలిగి, పదో తరగతి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 27 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రూ.కోటితో కైలాసభూమి నిర్మాణం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రూ.4 లక్షల విరాళం ప్రకటన


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

అన్నవరం: గ్రామంలో రూ.కోటితో కై లాసభూమి (హిందూ శ్మశానవాటిక) నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక సత్యగణపతి వర్తకసంఘం కల్యాణ మండపంలో గురువారం సర్పంచ్ ఎస్.కుమార్ రాజా అధ్యక్షత శ్మశానవాటిక నిర్మాణంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు గత మూడేళ్లుగా శ్మశానవాటికకు స్థలం కోసం ప్రయత్నాలు చేశామన్నారు. చివరకు సర్వే నంబర్ 76లో దాత జంపన కేశవరాజుకు చెందిన 1.20 ఎకరాల స్థలాన్ని శ్మశానవాటికకు కేటాయించినట్టు తెలిపారు. ఈ స్థలంలో ఎంపీ గ్రాంట్, ఎమ్మెల్యే గ్రాంట్, మండల పరిషత్, పంచాయతీ నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలతో శ్మశానవాటిక నిర్మిస్తామని తెలిపారు. అలాగే దాతలతో మాట్లాడి మృతదేహాలను శ్మశానవాటికకు తరలించేందుకు కైలాసరథం కూడా సమకూర్చుతానని చెప్పారు. శ్మశానవాటిక నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.4 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

వ్రతపురోహిత సంఘం రూ.10 లక్షల విరాళం

శ్మశానవాటిక నిర్మాణానికి అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘం రూ.10 లక్షలు విరాళం ప్రకటించింది. ఈ మేరకు సంఘ గౌరవాధ్యక్షుడు నాగాభట్ల కామేశ్వరశర్మ సమావేశంలో ప్రకటించారు. సత్యదేవ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడి హోదాలో రూ.1,01,116 విరాళాన్ని కామేశ్వరశర్మ ప్రకటించారు. మాజీ ఉపసర్పంచ్ పెద్దింటి నారాయణరావు తన వంతుగా శ్మశానవాటికలో ఒక శవదహన బెడ్ నిర్మాణానికి విరాళాన్ని ప్రకటించారు. సమావేశంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, వైస్ ఎంపీపీ ధారా వేంకటరమణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమణమూర్తి, వెంకట్, పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు కందర్ప సత్యనారాయణ మూర్తి, అన్నవరం ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు పాల్గొన్నారు.

జూలై ఒకటి నుంచి జగనన్న సురక్ష

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం జూలై ఒకటవ తేదీ నుంచి మండల పరిధిలో సచివాలయాల వారీగా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ డి.శ్రీలలిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల స్థాయి అధికారులతో రెండు కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎంపీడీఓ డి శ్రీలలిత ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఆర్ఐ యు.బాలాజీ ఒక కమిటీ గాను, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.ప్రవీణ్‌కుమార్, వీఆర్వో వి భరత్ మరో కమిటీ గాను ఉంటారని తెలిపారు.

ఈ మేరకు జూలై ఒకటిన ఉండూరు-1, జూలై 3 పీబీ దేవం-1, జూలై 4న ఉండూరు-2, జూలై 5 పీబీ దేవం -2, 6వ తేదీన పి. వేమవరం, ఏడవ తేదిన జి మేడపాడు-1, 10న గొంచాల, 11న జి. మేడపాడు-2, 12వ తేదిన నవర, 13న వేట్లపాలెం-1, 14న చంద్రంపాలెం, 15న వేట్లపాలెం-2, 17న అచ్చంపేట, 18న వేట్లపాలెం-3, 19న పనసపాడు, 20న వేట్లపాలెం-4, 21న పవర, 22వ తేదిన హుస్సేన్ పురం, 24న మాధవపట్నం -1, 25న వీకే రాయపురం, 26న మాధవపట్నం-2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష పథకాలు అమలు చేయడం జరుగుతుందని వివరించారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లు ఆయా సచివాలయాల్లో ఉచితంగా పొందవచ్చునని ఆమె తెలిపారు.

ఆదర్శనీయుడు 'యాసలపు'


యాసలపు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: ఉద్యమ కారులకు ఆదర్శప్రాయులు యాసలపు సూర్యారావు అని సీపీఎం మాజీ ఎంపీ పి.మధు, సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. సూర్యారావు 11వ వర్ధంతి సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని సూర్యారావు భవనం వద్ద గురువారం నీలపాల సూరిబాబు అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలతో రాజీ పడకుండా ప్రజా నాయకుడిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఆయన చూపిన చొరవ, పట్టుదల మరువలేనివన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దువ్వా శేషుబాబ్జి, కరణం ప్రసాదరావు, సాహితి స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ యువతకు స్ఫూర్తినిచ్చిన నాయకుడు యాసలపు సూర్యారావు అన్నారు. తొలుత యాసలపు చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తొమ్మిదేళ్ల బీజేపీ పాలన తీరుతెన్నులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ, దాడి బేబీ, దారపురెడ్డి కృష్ణ, కేదారి నాగు, పలివెల వీరబాబు, కరణం శ్రీనివాస్, యాసలపు రమేష్, మాగాపు నాగు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు పెంచాలి


నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి మల్లికార్జునరావు

పెద్దాపురం: జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్ మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని వాలు తిమ్మాపురం, ఆర్‌బి పట్నం గ్రామాల్లో గురువారం ఉద్యాన పంటలను సందర్శించారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను, కోల్డ్ స్టోరేజి, కలెక్షన్ సెంటర్, పతంజలి ఫుడ్స్ ఆయిల్ పామ్ పరిశ్రమలో ఉన్న ఆయిల్‌పామ్ నర్సరీలను ఆయన పరిశీలించారు. 12 నెలల వయసు దాటిన నాణ్యమైన పామాయిల్ మొక్కలను మాత్రమే రైతులకు పంపిణీ చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఏపీఎఫ్‌పీఎస్ ద్వారా 35 శాతం సబ్సిడీపై చిన్న తరహా కుటీర పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలను ఆసక్తి కలిగిన రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మల్లికార్జునరావు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్ఓ నూనె సుజాత, వీహెచ్ఏ ఎం.చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రగతికి కష్టించి పనిచేయండి

- విజయవాడ జోన్ ఈడీ గోపీనాథ్‌రెడ్డి
- ఉద్యోగులకు ప్రోత్సాహకాల అందజేత


ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న విజయవాడ జోన్ ఈడీ గోపీనాథ్‌రెడ్డి

కాకినాడ: ప్రతి ఉద్యోగి మరింత కష్టించి పనిచేసి ప్రయాణికుల మన్ననలు పొందాలని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథ్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన కాకినాడ ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలు, నగదు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ లాభాల బాటలో పయనించేలా ప్రతి ఉద్యోగి మరింత అంకిత భావంతో కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, ఆర్టీసీ అధికారులు వి.రవిశంకర్, కె.ప్రభాకరరావు, కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో చోరీ

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం రజకపేటలో కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం రాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీలోని డబ్బును దొంగిలించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగరాజు తెలిపారు. ఆలయంలోని సీసీ పుటేజిని పరిశీలిస్తున్నామని, నిందితులు సీసీ పుటేజీలో కనిపిస్తున్నారన్నారు.

ద్విచక్రవాహనం చోరీపై కేసు

గండేపల్లి: ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై వై.గణేష్ కుమార్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని ఉప్పలపాడుకు చెందిన అయినాల రవికుమార్ ఈ నెల 15న నీలాద్రిరావుపేటలోని వీరమ్మ పేరంటాలు అమ్మవారి ఆలయం వద్ద తన మోటార్ సైకిల్‌ను పార్కింగ్ చేసి ఎలక్ట్రికల్ పనికి వెళ్లాడు. పని ముగించుకుని వచ్చే సరికి మోటార్ సైకిల్ కనబడలేదు. ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినప్పటికీ దొరకకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: గ్రామ శివారు పోలవరం గట్టు సమీపంలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.2800 స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

ప్రజల అవసరాలు గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం విజయవంతం కావడానికి శుక్రవారం నుంచి వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారి అవసరాలను తెలుసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. గురువారం సాయంత్రం కమిషనర్ చాంబర్‌లో పట్టణ పరిధిలో సచివాలయ కార్యదర్శులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జగనన్న సురక్ష పథకం ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేసి వారికి కావలసిన సర్టిఫికెట్లకు కావలసిన పత్రాలను సిద్ధం చేసుకునే విధంగా ప్రజలలో వలంటీర్లు అవగాహన పెంచాలన్నారు. ఆయా సచివాలయాలలో ఉచితంగా సర్టిఫికెట్లు, వివాహ నమోదు పత్రాలు ఉచితంగా ఇస్తున్న విషయాన్ని తెలియజేయాలని సూచించారు. మున్సిపల్ మేనేజరు అచ్యుత రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే టీటీఐగా చైతన్య


ఎస్ఎంకు జాయినింగ్ రిపోర్ట్ అందజేసిన చైతన్య

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ చెకింగ్ ఇన్‌స్పెక్టరుగా డీకెవీఎస్‌పీ చైతన్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్‌ను కలసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. విజయవాడ నుంచి బదిలీపై వచ్చిన చైతన్య ప్రయాణికులకు వృత్తి పరంగా మెరుగైన సేవలందించాలని సూచించారు.

వినాయకుడికి లక్ష గరిక పూజ


విశేష అలంకారంలో విఘ్నేశ్వరస్వామి

పిఠాపురం: స్థానిక చిన్నమాంబ పార్క్ వద్ద వేంచేసిన విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు స్వామి వారికి లక్ష గరిక పూజ చేశారు. స్వామివారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కొత్తపల్లి: తీరప్రాంత గ్రామాల్లోని తాగునీటి సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ కోరారు. మండలంలోని ఉప్పాడ శివారు సుబ్బంపేట, కొత్తపట్నం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందడం లేదన్నారు. కొన్నిచోట్ల కలుషితమైన తాగునీరు సరఫరా అవుతుందని, దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టి వాటర్ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

GENERAL PUBLICATION
FINANCE LIMITED
SCHEDULE
G.S.M.H. SWAMY, G.A.S.S. JYOTHI
KAKINADA